# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-08-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు నుండి రెండు రోజులపాటు గుజరాత్‌లో పర్యటిస్తారు.**
2. **తెలంగాణ ప్రభుత్వం చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌లో ఈ రోజు నుంచి ఇంటింటికీ స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం పంపిణీ చేయనుంది.**
4. **క్రీడా రంగానికి ప్రాధాన్యతనిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నూతన క్రీడా విధానాన్ని తీసుకువచ్చిందని ఆ శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.**
5. **అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శక విధానంలో ఫించన్లు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.**

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు నుండి రెండు రోజులపాటు గుజరాత్‌లో పర్యటిస్తారు. ఈ సాయంత్రం అహ్మదాబాద్‌లో 5 వేల 400 కోట్ల రూపాయలతో చేపడుతున్న బహుళ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. అనంతరం జరిగే బహిరంగ కార్యక్రమంలో ప్రధానమంత్రి పాల్గొని ప్రసంగిస్తారు. అలాగే రేపు ఉదయం అహ్మదాబాద్‌లోని హన్సల్‌పూర్‌లో హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్‌ల స్థానిక ఉత్పత్తి, బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహన ఎగుమతులను ప్రారంభిస్తారు. 1 వేయి 400 కోట్ల రూపాయల రైల్వే ప్రాజెక్టులను ప్రధానమంత్రి జాతికి అంకితం చేస్తారు. అహ్మదాబాద్-మెహ్సానా-పాలన్‌పూర్ రహదారిపై ఆరు వరసల అండర్‌పాస్‌ల నిర్మాణానికి, అహ్మదాబాద్-విరామ్‌గామ్ రహదారిపై రైల్వే ఓవర్‌బ్రిడ్జికి కూడా ప్రధానమంత్రి శంకుస్థాపన చేస్తారు.

--------------------------

అనారోగ్యంతో కన్నుమూసిన భారత కమ్యూనిస్ట్ పార్టీ -సీపీఐ సీనియర్ నాయకుల సురవరం సుధాకర్ రెడ్డి భౌతికకాయానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిన్న నివాళులు అర్పించారు. హైదరాబాద్‌లో సుధాకర్ రెడ్డి భౌతికకాయాన్ని ముఖ్యమంత్రి సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం చంద్రబాబు నాయుడు పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ .. 33 సెకన్లు

కాగా.. తెలంగాణా ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సుధాకర్ రెడ్డి భౌతిక కాయానికి నివాళులు అర్పించారు.

--------------------------

తెలంగాణ ప్రభుత్వం  చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ లోని ముఖ్యమంత్రి నివాసంలో తెలుగు చలన చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు నిర్మాతలు, దర్శకులు గత రాత్రి  ముఖ్యమంత్రితో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, చిత్ర పరిశ్రమలోకి కొత్తగా వచ్చేవారి నైపుణ్యాలు పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం నైపుణ్య విశ్వవిద్యాలయంలో  సినిమా పరిశ్రమ కోసం కావాల్సిన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. నిర్మాతలు, కార్మికుల అంశంలో సంస్కరణలు అవసరమని వారి విషయంలో నిర్మాతలు నిర్ణయాత్మకంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఈ రోజు నుంచి ఇంటింటికీ స్మార్ట్ రేషన్ కార్డులను అధికారులు పంపిణీ చేస్తారు. నాలుగు విడతల్లో  జరగనున్న ఈ పంపిణీలో తొలి విడతలో భాగంగా 9 జిల్లాల్లో కార్డుల పంపిణీ చేపట్టనున్నారు. మొదటి విడతలో ఈరోజు నుంచి విజయనగరం, విశాఖపట్నం, తిరుపతి, శ్రీపొట్టి శ్రీరాములు  నెల్లూరు, శ్రీకాకుళం,తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో రేషన్ కార్డులను జారీ చేయనున్నారు. ఇంటి వద్ద అందుబాటులో లేనివారికి ఆయా రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారులకు అందజేస్తారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లాలో రేషన్ కార్డుల పంపిణీపై జిల్లా పౌర సరఫరాల శాఖ  అధికారి పాపారావు మాట్లాడుతూ,

వాయిస్ ..33 సెకన్లు

అలాగే  ఈ నెల 30 నుంచి రెండో విడతలో 4 జిల్లాల్లో, వచ్చే నెల 6 నుంచి మూడో విడతలో 5 జిల్లాలో రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నామని అధికారులు తెలిపారు.

---------------------------

క్రీడా రంగానికి ప్రాధాన్యతనిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నూతన క్రీడా విధానాన్ని తీసుకువచ్చిందని ఆ శాఖ మంత్రి ఎం రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ నెల 29 న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ– శాప్ ఆధ్వర్యంలో తిరుపతిలో అమరావతి ఛాంపియన్ షిప్ 2025 రాష్ట్రస్థాయి పోటీలను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా రాం ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ...

వాయిస్ ..32 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో  ఆయుర్వేద, హోమియో, యునాని మందుల తయారీ యూనిట్లు, దుకాణాల నిర్వహణ రెన్యువల్ కోసం ఈరోజు నుంచి మేళాలు నిర్వహిస్తున్నట్లు ఆయుష్ శాఖ సంచాలకులు కె.దినేష్‌కుమార్  ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన తయారీ యూనిట్లు, దుకాణాల యజమానులు, వ్యాపారుల కోసం ఈరోజు, రేపు ఏలూరులోని ఆయుష్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. సెప్టెంబర్ 1, 2 తేదీల్లో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు ఒంగోలులోను, సెప్టెంబర్ 8, 9 తేదీల్లో ఉమ్మడి కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలవారికి కడపలో  మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

---------------------------

అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శక విధానంలో ఫించన్లు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులోని క్యాంపు కార్యాలయంలో నిన్న నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. దివ్యాంగుల పింఛన్లు తొలగిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని తెలిపారు. అర్హులెవరికైనా ఫించన్ తొలగిస్తే మళ్లీ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని, ఈ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు.

---------------------------

కెనడాలోని విన్నిపెగ్‌లో జరుగుతున్న ప్రపంచ యూత్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్ 2025లో భారత్‌కు చెందిన శార్వరి సోమనాథ్ షెండే స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. అండర్ -18 మహిళల వ్యక్తిగత విభాగంలో నిన్న జరిగిన ఫైనల్‌లో దక్షిణ కొరియాకు చెందిన కిమ్ యెవాన్‌ను 6-5 తేడాతో ఓడించింది. దీంతో ప్రపంచ యూత్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో స్వర్ణం గెలిచిన రెండవ భారతీయ మహిళగా సోమనాథ్ షెండే నిలిచారు.

---------------------------

వాయువ్య బంగాళాఖాతంలో ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలకు సమీపంలో ఈరోజు అల్పపీడనం ఏర్పడే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఈరోజు, రేపు ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ...

వాయిస్..24 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ అల్పపీడన ప్రభావంతో అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================